ప్రజాశక్తి
బుధవారం 17 మే 2023
5
పార్వతీపురం మన్యం

చైల్డ్ హుడ్ కేర్ ఎడ్యుకేషన్ కోర్సుకు దరఖాస్తు గడువు పెంపు

కలెక్టరేట్: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో అంగన్వాడీ వర్కర్లకు ఉపయోగపడే ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ కోర్సుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 వరకు గడువును పెంచుతున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సిహెచ్ఎ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఆరు నెలల ఈ సర్టిఫికెట్ కోర్సును విశ్వ విద్యాలయం ఎడ్యుకేషన్ విభాగం ద్వారా నిర్వహిస్తున్నామని అయన తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన వారు ఎవరైనా ఈ కోర్సులో చేరేందుకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. అంగన్వాడీ వర్కర్లకు ప్రవేశ సమయంలో ప్రాధాన్యత ఇస్తామన్నారు. వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్ సైట్ http:// www.brau.edu.in చూడాలన్నారు. పూర్తి చేసిన దఖాస్తులతో పాటు రూ.250 రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్ ద్వారా లేదా డిడి రూపంలో చెల్లించి, దరఖాస్తుకు జత చేయాలన్నారు. పూర్తి చేసిన దఖాస్తులను ఈనెల31లోగా విశ్వ విద్యాలయానికి పంపాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సిహెచ్ఎ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

ఈదురుగాలుల బీభత్సం

● పలుచోట్ల విరిగిపడిన చెట్లు, హోర్డింగ్‌లు ● కూలిపోయిన విద్యుత్తు స్తంభాలు ● నగరమంతా అంధకారం ●పిడుగు పడి ఒకరు మృతి

ప్రజాశక్తి -విజయనగరం, జామి, గజపతినగరం

జిల్లాలో పలుచోట్ల మంగళవారం మధ్యాహ్నం ఈదురు గాలులతో పాటు వడగళ్ల వర్షం కురిసింది. విజయనగరంలో సుమారు గంటపాటు వీచిన గాలులకు హోర్డింగ్‌లు నేల కూలాయి. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్తు సిబ్బంది స్పందించి చెట్ల కొమ్మలను తొలగించారు. పోలీసు బ్యారెక్సు వద్ద రహదారిపై పెద్ద చెట్టు కూలిపోవడంతో విజయ నగరం, గజవతినగరం మధ్య వాహనాల రాకపోకలు చాలా సేపు నిలిచి పోయాయి. పోలీసులు స్పందించి చెట్టును తొలగించడంతో సాయంత్రం రాకపోకలు పునరుద్ధరణ జరిగాయి. గాలులకు నగరంలోని పలు షో రూముల అద్దాల పగిలాయి. వర్షంతో ఎక్కడికక్కడ రోడ్లపై నిలిచిన నీటిని

విద్యుత్తు స్తంభాలను సరిచేస్తున్న సిబ్బంది

ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద విరిగిన ఫ్లెక్సీ

ఎప్పటికప్పుడు సిబ్బందితో తొలగించే ఏర్పాట్లను నగరపాలక సంస్థకు చెందిన అధికారులు పర్యవేక్షించారు. గాలుల వల్ల చెట్ల కొమ్మలు విద్యుత్తు వైర్లపై పడడంతో నగరమంతా రాత్రి 8గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు విద్యుత్ లేకపోవడంతో ప్రజలు విల విలలాడిపోయారు. ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సర్వజన ఆస్పత్రిలో రోగులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

రాత్రి 11గంటలు వరకు పునరుద్ధరణకాని విద్యుత్ సరఫరా

ఈదురుగాలులతో చెట్లు, విద్యుత్తు స్తంభాలు విరిగిపోవడంతో నగరమంతా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వివిధ ప్రాంతాల్లో 18 వరకు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో రాత్రి 11గంటలవరకు విద్యుత్ రాకపోవడంతో ప్రజలంతా విల విలలాడిపోయారు. విద్యుత్ స్తంభాలు పునరుద్ధరణ ప్రక్రియ రాత్రంతా కొనసాగింది. గాలికి అనేక చెట్లు విద్యుత్తు స్తంభాలపై విరిగిపడిపోవడంతో వైర్లు తెగిపోయాయి. దీంతో విద్యుత్తుశాఖ సిబ్బంది పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. పలుచోట్ల రాత్రి 8గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించినా ఎక్కవ చోట్ల పునరుద్ధరణ కాలేదు. చెట్లు కొమ్మలు తొలగించేందుకు, స్తంభాలను సరిచేసేందుకు సుమారు 250 మంది సిబ్బంది పని చేస్తున్నారని ఇఇ నాగిరెడ్డి కృష్ణమూర్తి తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ అయ్యేవరకు ప్రజలు సహకరించా లని ఆయన కోరారు.

గజపతినగరంలో భారీ గాలులకు పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. వర్షంతో ప్రజలు సేద తీరారు. జామిలో ఈదురుగాలుల భీభత్సం సృష్టించాయి. గ్రామంలో పలు చోట్ల చెట్లు నేల కూలాయి. మంగళవారం 45 డిగ్రీలు ఉష్ణోగ్రతలు నమొదైనప్పటికీ సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. తొలుత ఈదురు గాలులు రాగా, చెదురుమదురు జల్లులు కురిశాయి. దీంతో జనం సేదతీరారు. మరోవైపు గత మూడు రోజులుగా ఎండలు తీవ్రమై, ప్రజలు అల్లాడిపోతున్నారు. ఈ నేపథ్యంలో కురిసిన వర్షం ప్రజలకు ఊరట కలిగించింది.

పిడుగుపడి పశువుల కాపరి మృతి

జామి మండలంలోని కొత్త భీమసింగి గ్రామానికి చెందిన పాండ్రంకి అప్పారావు (40) పిడుగుపాటుకు గురై మృతి చెందాడు. గ్రామంలోని పొలాల్లో పశువులు కాస్తుండగా, పిడుగు పడడంతో అక్కడికక్కడే కన్నుమూశాడు. దీంతో గ్రామంలో విషాధ ఛాయలు అలుముకున్నాయి. అప్పారావుకు భార్య, కుమారుడు ఉన్నారు. తహశీల్దార్ హేమంత్ కుమార్, ఎస్ఐ వీరబాబు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేశారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

రబీ ధాన్యం కొనుగోలులో అలసత్వం వద్దు : జెసి

ప్రజాశక్తి - కలెక్టరేట్

రబీ ధాన్యం కొనుగోలులో అలసత్వం వహించొద్దని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు రబీ ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలుపై సివిల్ సప్లయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతుభరోసా కేంద్రాల వారీగా ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రాలు, వాటి ధాన్యం సేకరణ లక్ష్యాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింటు కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ధాన్యం గింజ కొనుగోలు చేయాలని, రైతులు దళారీ వ్యవస్థ బారిన పడకుండా చూడాలని అన్నారు. రైతులకు అవసరమైన గోనె సంచులను ధాన్యం సేకరణ కేంద్రాల పరిధిలో గల రైతులకు అందజేయాలన్నారు. రైతులకు ధాన్యం రవాణా డబ్బులు ఎప్పటికప్పుడు చెల్లించాలని, అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధాన్యం సేకరణకు సంబంధించిన కరస్పాండెన్స్ మొత్తం ఈ-ఆఫీసులో పొందుపర్చాలని అధికారులకు సూచించారు. మండల వ్యవసాయ శాఖ, కో-ఆపరేటవ్ సొసైటీ, మార్కెటింగ్ అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని, అప్పుడే లక్ష్యాలను పూర్తి చేయగలమని అన్నారు. సమావేశాలకు అధికారులు సమగ్రమైన, సరైన సమాచారంతో హాజరు కావాలని అధికారులను ఆదేశించారు. రవాణా సౌకర్యం లేని రైతులకు వాహనాలను చేకూర్చి రవాణా జరిగేలా చూడాలని, వాహనాలు సమకూర్చుకొన్న రైతులకు రవాణా చార్జీలు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మార్క్ ఫెడ్ పనితీరు సంతృప్తికరంగా లేదని, వచ్చే సమావేశం నాటికి పనితీరు మెరుగుపరచుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రాబర్ట్ పాల్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ నాయక్, వ్యవసాయ శాఖ డిడి ఎం.మధుసూదన రావు, వెంకటేష్, ఎ.నిర్మల జ్యోతి, మండల వ్యవసాయ శాఖ, సివిల్ సప్లయి, కో ఆపరేటివ్ సొసైటీ, మార్క్ ఫెడ్ అధికారులు పాల్గొన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

డెంగీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాధరావు అన్నారు. ప్రపంచ డెంగీ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక పురపాలక శాఖ కార్యాలయం నుంచి బందంవారి వీధి, గాంధీ బొమ్మ వరకు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల వల్ల డెంగీవ్యాధి సోకుతుందని జ్వరం, తలనొప్పి, వాంతులు, కండరాల నొప్పి వస్తాయని అన్నారు. డెంగీ వ్యాధి బయట పడడానికి వారం రోజులు పడుతుందన్నారు. డెంగీ వల్ల రక్తహీనత, ప్లేట్లెట్ కౌంట్ తగ్గుతుందన్నారు. కావున పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డెంగీ వ్యాధి సోకిన వారు త్వరితగతిన స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో తనిఖీ చేయించుకొని వైద్యుల సూచనలను తప్పక పాటించాలని తెలిపారు. అప్రమతతే ఆరోగ్యానికి ప్రథమ సూచిక అన్నారు. దోమలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. దోమ తెరలు వినియోగించడం అలవాటుగా మారాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ జె.రామ అప్పలనాయుడు, ఆర్.బి.ఎస్.కె డా. డి. భాస్కర రావు, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ శ్యామ్ కుమార్, పలువురు ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య అధికారి జి.ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఇంటి ముందు మురికి కాలువలో చెత్త ఉంచకూడదని, కుళాయి పాయింట్ నీరు లీకులు లేకుండా చూడాలని, ఇంటి చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎయిర్ కూలర్‌లో వారానికి ఒకసారి నీరు మార్చుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు పార్వతి, శాంత కుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ జగన్నాధరావు

గుమ్మలక్ష్మీపురం : జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా తాడికొండలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి బుద్దేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో, ఇంటి పరిసరాల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. దుడ్డుఖల్లు, రేగిడి పరిధిలో డెంగీ దినోత్సవ ర్యాలీ లు నిర్వహించారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం మలేరియా సబ్ యూనిట్ అధికారులు నారాయణరావు, ఆరోగ్యకార్యకర్తలు శ్రీను, యారాయమ్మ, సింహాచలం, నిమ్మకూరి, రత్నప్రసాద్, ఎస్. వి ప్రకాష్, రాజేష్, ప్రభావతి, ధనలక్ష్మి ఉన్నారు.

సీతంపేట : స్థానిక ఏరియా ఆసుపత్రి దోనుభాయి, మర్రిపాడు, కుషిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయపార్వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డెంగీ నివారణకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మర్రిపాడు వైద్యాధికారి సాయిచరణ్, చాందిని, భానుప్రతాప్, సబ్బియోపతి, అధికారి మోహనరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బంజరగూడ, పూతికవలస రేగూలుగూడ తదితరు గ్రామాల్లో స్ప్రేయింగ్ చేశారు. కార్యక్రమంలో మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎల్‌వి సుబ్రమణ్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఆర్.జమ్ములోని మాతోట లబ్దిదారుల క్షేత్రంలో ఏడాది పొడవునా పంటలు పండించుకోవడానికి అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో బోరు నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్రాంత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వి సుబ్రమణ్యం ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం మాతోట లోని మామిడి, సపోటా, జీడి, అంతర పంటలను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. చాపరాయి బిన్నిడిలో గ్రావిటీ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ప్రారంభించారు. అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ ఆర్థిక సహకారం రూ.3 లక్షలు, గ్రామస్తుల శ్రమదానం రూ.లక్ష 63 వేల 49తో జట్టు సంస్థ పర్యవేక్షణలో నిర్మించినట్లు జట్టు వ్యవస్థాపకులు డాక్టర్ డి.పారినాయుడు తెలిపారు. అనంతరం గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పథకాలను ప్రజలు సమర్థవంతంగా వినియోగించుకొని ఆర్థిక స్వాలంబన సాధించే దిశగా అడుగులు ముందుకు వేయాలని ఇందుకు ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థల పరంగా వస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ గ్రావిటీ ద్వారా ఎన్ని కుటుంబాలకు మంచినీరు సరఫరా అవుతుంది, ఎన్ని ఎకరాలకు, ఎన్ని గ్రామాలకు పంటలు పండించుకోవడానికి నీరు సరఫరా సరిపోతుందని గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో 75 ఇళ్లకు మంచినీరు సరఫరా,

బోరును ప్రారంభిస్తున్న ప్రభుత్వ విశ్రాంత ప్రధాన కార్యదర్శి ఎల్‌వి సుబ్రమణ్యం

చాపరాయిబిన్నిడి, మూలబిన్నిడి గ్రామాల్లోని 75 మంది రైతులకు 140 ఎకరాల వరకు పంట పొలాలకు సమృద్ధిగా పంటలు పండించుకోవడానికి అవకాశం కలుగుతుందని గ్రామస్తులు తెలిపారు. ప్రకృతిని, పంటలను వినాశపరిచే ఏ కార్యక్రమాలు కూడా ఎవరు చేయకూడదని, ప్రకృతిని పరిరక్షించే మానవాళికి సహాయపడే కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ స్వతసిద్ధంగా చేయాలన్నారు. గతంలో పార్వతీపురం ఐటిడిఎ ప్రాంతంలో పనిచేసినప్పటి అనుభవాలను, గ్రామస్తులతో పరిచయాలను సుబ్రహ్మణ్యం గుర్తు చేసుకున్నారు. పండ్ల తోటల్లో అంతర పంటలు, పలుపంటలు ఏడాది పొడవునా పండించుకునేలా తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. జట్టు సంస్థ గిరిజన గ్రామాల్లోని మారుమూల ప్రాంతాల్లో గల ప్రజలను చైతన్యపర్చడం, పథకాలను వారి చెంతకే చేరవేయడంలోనూ, మారుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఆధునిక యంత్ర పరికరాలను వినియోగించుకోవడం వంటి సూచనలు, సలహాలు సంబంధిత కార్యకర్తల ద్వారా నేరుగా చేరువ చేయడం అభినందించదగ్గ విషయమన్నారు. గిరిజన ప్రాంతాల్లో పండించే వివిధ రకాల పంటల స్టాల్ ను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు, సర్పంచ్ ఎం.దివ్యభారతి, ఎంపిటిసి సభ్యులు శ్రీలక్ష్మి, జట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ ప్రహరాజ్, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్లి మృతి

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్లి మధుసూదనరావు మంగళవారం గుండెపోటుతో మరణించారు. విజయనగరంలోని ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన తుది శ్వాస విడిచారు. 2005 నుంచి 2009 వరకు ఆయన మున్సిపల్ వైస్‌చైర్మన్‌గా పనిచేశారు. అంతకు ముందు డిసిసిబి డైరెక్టర్‌గా పనిచేశారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులతో సత్సంబంధాలు కలిగిన మధుసూదనరావు నియోజకవర్గ రాజకీయాలను శాసించారు. ఆయనకు భార్య నాగమణి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ముగడ గంగమ్మ, అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, వైసిపి పట్టణ మాజీ అధ్యక్షులు జర్జాపు సూరిబాబు, కౌన్సిలర్లు గిరిరఘు, గొర్లి వెంకటరమణ, జి.నాగేశ్వరరావు, వైసిపి నాయకులు చొక్కాపు గోపి, డిసిఎంఎస్ డైరెక్టర్ పిరిడి రామకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు.

మధుసూదనరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రాజన్నదొర

నివాళులర్పించిన డిప్యూటీ సీఎం

మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గొర్లి మధుసూదనరావు మృతికి డిప్యూటీ సీఎం రాజన్నదొర సంతాపం వ్యక్తం చేశారు. మధుసూదనరావు నివాసం వద్ద ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.గొర్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు.నియోజకవర్గ రాజకీయాల్లో సీనియర్ నాయకులు గొర్లి మధుసూదనరావు చెరిగిపోని ముద్ర వేశారని ఆయన కొనియాడారు.

పరుగు పందెంలో ఆగిన ఊపిరి

ప్రజాశక్తి - వీరఘట్టం

పోలీసు శాఖలో ఉద్యోగం సంపాదించాలనే అతడి ఆశ చివరకు పరుగు పందెంలో ఊపిరి ఆగిపోయింది. ఎంతో తపనతో నిత్యం వ్యాయం చేస్తూ ఎలాగైనా ఉద్యోగం సంపాదించాలని అతని జీవితం అర్ధాంతరంగా ముగిసిపోయింది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని ఎం.రాజ పురం దళిత వీధికి చెందిన దర్రు రాజేష్ (21) మంగళవారం అనకాపల్లిలో జరిగే ఎస్ఎస్‌సి సెలక్షన్‌కు వెళ్లాడు. ఎంపికలో భాగంగా అతడు పరుగెడుతుండగా ఊపిరి ఆడక ఒక్కసారిగా గుండె ఆగి కుప్ప కూలిపోయాడు. సిబ్బంది తక్షణమే అంబులెన్సు లో చికిత్స కోసం హాస్పిటల్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ విషయం అతని స్నేహితుడు గ్రామ యువకులకు తెలియడంతో జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలిపారు. ఒక్కసారి వీధి అంతా ఉలిక్కిపడింది. రాజేష్ వీరఘట్టంలోని వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఈయనకు తల్లిదండ్రులు సింహాచలం, కుమారి, నాన్నమ్మ నరసమ్మ, చెల్లెలు ఉంది. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. విషయం తెలిసిన వెంటనే బంధువులు అనకాపల్లి బయలుదేరారు .రాజేష్ మృతి చెందాడన్న విషయం తెలియడంతో గ్రామమంతా శోకసంద్రంలో మునిగిపోయింది

మృతుడు రాజేష్

కానరాని కనీస మౌలిక వసతులు

గ్రామీణ పేదలకు జీవనోపాధిగా మారిన ఉపాధిహామీ చట్టం తూతూ మంత్రంగా అమలవుతోంది. కూలీలు పనిచేసే ప్రాంతంలో కనీస వసతులు కల్పించడంతో అటు ప్రభుత్వం, ఇటు అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. వేసవిలో ఉపాధి కూలీలకు భద్రత లేకుండా పోయింది. మండుటెండలో పనిచేసి కాసేపు సేదతీరుదామంటే నిలువ నీడ లేదు. పని చేసే ప్రాంతంలో టెంట్లు, మజ్జిగ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కనీసం తాగునీటి సదుపాయం కూడా కల్పించలేని స్థితిలో అధికార యంత్రాంగం ఉండడం గమనార్హం.

● అలవెన్సులు గాలికి ● బడ్జెట్లో నిధులు తగ్గింపు ●ఇబ్బందుల్లో ఉపాధి కూలీలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో 8500 జాబ్ కార్డులున్నాయి. రోజూ 7903 మంది కూలీలు పనికి వెళ్తున్నారు. 23 గ్రామ పంచాయతీల్లో కురుపాం, కిచ్చాడ పంచాయతీల్లో చెరువు పనులు జరుగుతుండగా మిగతా 21 పంచాయతీల్లో భూ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. పని ప్రదేశంలో టెంట్లు, చలివేంద్రాలు కానరావడం లేదు. గతంలో ఎండలకు ప్రతి గ్రూపులో చలువ పందిళ్ల ఏర్పాటు చేసే వారు. కానీ ఈ ఏడాది ఎటువంటి సౌకర్యాలు లేకపోవడంతో ఎండ తీవ్రతకు కూలీలు

ఎండలో పనిచేస్తున్న కూలీలు

విలవిలలాడిపోతున్నారు. పని ప్రదేశంలో మంచినీటి సౌకర్యం లేకపోవడంతో కూలీలు ఇంటి నుంచి మంచినీరు తెచ్చుకుంటున్నారు. అవి ఎండకు వేడెక్కి పోవడంతో తాగలేకపోతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేసవి అలవెన్సులు గాలికి

గతంలో ఏప్రిల్, మే నెలలో 30 శాతం, మార్చి జూన్ 25 శాతం, ఫిబ్ర వరి, జులైలో 20 శాతం అలవెన్సులు కూలీలకు అమలు చేసేవారు. ప్రస్తుతం ఆ ఊసేలేదు. గతంలో గ్రూపులోని ఒక్కొక్క సభ్యుడికి రెండు రూపాయలను మేట్‌కు ప్రభుత్వం అందజేసేది. ఇప్పుడు అది లేదు. కూలీలకు తట్ట, గడ్డపార, మజ్జిగ, చలువ పందిళ్లను ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యేవి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది.

కూర్చోడానికి అవకాశం కూడా లేదు

వేసవి ఉష్ణ తాపాన్ని లెక్కచేయకుండా కుటుంబ పోషణ కోసం ఉపాధి పని కోసం వెళ్తుంటే ప్రస్తుత పని ప్రదేశంలో ఎక్కడా టెంట్లు లేవు. టెంటు లేకపోవడంతో కనీసం అల్పాహారం తీసుకునే సమయంలో కూర్చోవడానికి వీలు ఉండడం కాకుండా ఎండ తాపాన్ని తట్టుకోవడానికి ఐదు నిమిషాలు సేద తీర్చుకుందామంటే నిలువ నీడ లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బడ్జెట్ లో తగ్గిన నిధుల కేటాయింపు

కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 2022 నుంచి ఎన్ఎస్ఐసి యాప్‌ను ప్రవేశపెట్టి ఉపాధి హామీ చట్టానికి సంబంధించిన పనులను దేశం మొత్తం ఈ యాప్లోలో అప్లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. పని దినాల్లో కోత కోస్తూ బడ్జెట్లో నిధులు కేటాయింపు తగ్గించింది. గతంలో ఉదయం ఒక్కసారి మాత్రమే మస్తర్లో హాజరు వేస్తూ ఉండేవారు. ప్రస్తుతం ఉదయం, మధ్యాహ్నం రెండు పూటలా హాజరు వేసి యాప్లో అప్లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో కూలీలు, మేట్ల మధ్య అవగాహన లోపించి సమస్యల్లో చిక్కు కుంటున్నారు. ఒక గ్రూపులోని సభ్యులంతా పనికి వెళ్తామని డిమాండ్ పెట్టినా తర్వాత, గ్రూపులోని సభ్యులు వ్యక్తిగత కారణాల వల్ల పనికి వెళ్లలేకపోతే పని దినాలు తగ్గిపోవడం ఉపాధి కూలీలను ఆందోళనకు గురిచేస్తుంది.

ప్రభుత్వం టెంట్లను పంపిణీ చేయలేదు

మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో 36మంది ఫీల్డ్ అసిస్టెంట్లు, 8 మంది టెక్నిక్ అసిస్టెంట్లు, నలుగురు బిఎఫ్‌టి ఉన్నారు. ఉపాధి పనులను వారు పరిశీలిస్తూ, మస్తర్లలో ఉదయం, మధ్యాహ్నం హాజరు వేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం టెంట్లను పంపిణీ చేయలేదు. 404 టెంట్ల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. 2018 నుంచి గడ్డపార, తట్ట, మజ్జిగ మంచినీటి సౌకర్యానికి సంబంధించిన ఛార్జీలను రద్దు చేసింది.

పి.బావాజీ
ఎపిఒ, కురుపాం.

మౌలిక వసతులు కల్పించాలి

ఉపాధి పనులు చేసే ప్రాంతంలో కూలీలకు కనీస మౌలిక వసతులు కల్పించాలి. వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూలీలకు అలవెన్స్, మజ్జిగ, మంచినీటి సదుపాయం, టెంటు సౌకర్యం ఏర్పాటు చేయాలి.

తాడంగి రామారావు,
ఉపాధి కూలీ, తెనుఖర్జ గ్రామం

ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు మంజూరు చేయాలి

పని కావాలని కోరుకునే హక్కు ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ చట్టం ద్వారా కల్పించాలని ఎలా ఉందో పని ప్రదేశంలో అన్ని రకాల సౌకర్యాలు కూడా చట్ట ప్రకారం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అలాగే ఇటీవల కాలంలో కొత్త జాబ్‌కార్డులు మంజూరు చేయటం లేదు సరి కదా ఉన్న వాటిని పలు కారణాలతో తొలగిస్తున్నారు. దీన్ని పరిశీలించాలి. కొత్త జాబ్ కార్డులు మంజూరు వేగవంతం చేయాలి.

షేక్ గౌస్, ఎస్.సొసైటీ,
కార్యదర్శి కురుపాం

వేతనాలు సక్రమంగా అందడం లేదు

మండుటెండలో వేసవి తాపాన్ని సైతం లెక్కచేయకుండా కుటుంబ పోషణ కోసం నెట్టుకు రావడానికి ఇంట్లో చిన్న పిల్లల సైతం విడిచిపెట్టి ఉపాధి హామీ పనికి వెళ్తున్నాం. కానీ సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నాం. వేతన బకాయిలు సకాలంలో అందించాలి.

తాడంగి సత్యవతి,
ఉపాధి కూలీ, తెనుఖర్జ.

ఏజెన్సీ ప్రాంతంలో దట్టంగా కురుస్తున్న మంచు

ఉదయం ఎండ.... రాత్రి మంచు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో ఉదయం వేళ ఎండలు మండిపోతుంటే రాత్రి సమయాల్లో దట్టమైన పొగ మంచు కురుస్తోంది. ఉదయం పూట ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు మంచు ప్రభావం చల్లదనాన్ని ఇస్తుంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఉష్ణోగ్రతలు 45డిగ్రీలు అత్యధిక స్థాయిలో నమోదవుతున్నాయి. ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. మండు వేసవిలో కూడా దట్టమైన పొగ మంచు కురవడంతో ఏజెన్సీ కొద్ది పాటి చలి ప్రభావం కనిపిస్తోంది. గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీలో మంగళవారం ఉదయం దట్టమైన పొగ మంచు కురుస్తున్న దృశ్యం ఇది.

ఎండలతో ప్రజలు బెంబేలు

పార్వతీపురంటౌన్ : జిల్లాలో గత మూడు రోజులుగా ఒక్కసారిగా ఉష్ణోగ్రతల తీవ్రత పెరిగి ఎండలు బెంబేలెత్తిస్తున్నాయి. జిల్లా పట్టణంలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి ఎండలు ఎక్కువగా ఉండి ఉష్ణోగ్రతలు అంతకంతకు పెరిగిపోతుండడంతో పనులపై బయటకు వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకే ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వాణిజ్యసముదాయాలను మూసివేసి వ్యాపారులు ఇళ్లకే పరిమితమవుతున్నారు. మళ్లీ సాయంత్రం ఐదు గంటలు దాటాకే దుకాణాలకు వస్తున్నారు. అత్యధిక ఉష్ణోగ్రతలతో గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు నానా అవస్థలు పడుతూ ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఇంత అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండడం ఏమిటో అని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

నిత్యవసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ, వృద్ధ మిత్ర కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్న కె.కృష్ణమూర్తి మంగళవారం పట్టణంలో కొత్తవలసలో గల నాయీ బ్రాహ్మణ వయో వృద్ధులకు, వితంతువులకు చీరలు, దుప్పట్లు, బియ్యం, నిత్యవసర సరుకులను సంఘ పెద్దలు, విశ్రాంత ఎంపిడిఒ కె.కృష్ణారావు, నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు పి.శివప్రసాద్, ఎపిఎస్ ఆర్‌టిసి యూనియన్ నాయకులు పి. శంకర్రావు, బి.వెంకటరమణ, పి. సూర్యనారాయణ, రెడ్ క్రాస్ అసోసియేషన్ సభ్యులు బోటు రామకృష్ణ తదితరుల సమక్షంలో పంపిణీ చేశారు. అనంతరము కృష్ణమూర్తి సేవలను గుర్తించి నాయి బ్రాహ్మణ సంఘం సభ్యులు ఆయన్ను దుస్సాలువాతో సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య

ప్రజాశక్తి - భామిని

ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ఈ ఏడాది మండలంలోని పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు సత్తా చాటాయని, సమగ్ర విద్యకు ప్రభుత్వ పాఠశాలకు మించింది ఏది లేదని బాలేరు ఎంపిటిసి కొత్తకోట చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని బాలేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు మౌలిక సదుపాయాల్లో కార్పొరేట్ పాఠశాలలను తలపిస్తున్నాయని, ప్రభుత్వ పాఠశాలలో చదవడం అంటేనే గౌరవమని, మీ పిల్లలు సరైన విద్య, నైతిక విలువలు నేర్చుకోవాలంటే అది ప్రభుత్వ పాఠశాలతోనే సాధ్యమని ఎంపిటిసి అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జామి ప్రభాకర్, వైసిపి సీనియర్ నాయకులు కొత్తకోట ఆంజనేయులు, హెచ్‌ఎం జామి రమేష్, ఉపాధ్యాయులు, ఉత్తేర్నిత సాధించిన విద్యార్థులు వున్నారు.

గంగాపురంలో గడపగడపకు కార్యక్రమం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

మండలంలోని గంగాపురం పంచాయతీ కేంద్రంలో మంగళవారం ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలుసుకొని వివరాలకు సంబంధించి కరపత్రాలు అందించారు. ఎలాంటి అవినీతి లేకుండా మధ్యవర్తుల ప్రమేయం రాకుండా సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తున్న ముఖ్యమంత్రిని ప్రతి ఒక్కరూ బలపరచాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి శ్రీరాములు, జడ్పిటిసి బలగ రేవతమ్మ, ఎంపిపి శోభారాణి, ఎఎంసి చైర్మన్ భాగ్యలక్ష్మి, నాయకులు భీమవరపు కృష్ణమూర్తి, మడక విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

రెడ్డివానివలసలో వైద్య శిబిరం

సీతానగరం : మండలంలోని రెడ్డివానివలసలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని కె.శిరీష ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం మాట్లాడుతూ రోగులను పరీక్షించి తనిఖీలు నిర్వహించారు. అంతేకాకుండా ఇంటింటికి సర్వే నిర్వహించామన్నారు. అలాగే గ్రామంలో పారిశుధ్యం కూడా పరిశీలించారు, వేసవిలో వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె అన్నారు . కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంట సత్యనారాయణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు

సచివాలయ సిబ్బందితో సమావేశం

బొబ్బిలి : పట్టణంలోని 15వ సచివాలయ (4,29 వార్డు) సిబ్బందితో మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీ కృష్ణ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా సచివాలయ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పని చేయని వాలెంటర్స్‌ను తక్షణమే తొలగించాని ఆదేశించారు. వార్డులో వచ్చిన ఫిర్యాదులను ఆలస్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు రేజేటి ఈశ్వరరావు, అమర్ నాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతియుతంగా మెలగాలి : డిఎస్‌పి

వంగర: తగాదాలకు తావు లేకుండా సమస్య ఏదైనా ఉంటే చర్చించుకుని శాంతియుతంగా మెలగాలని చీపురుపల్లి డిఎస్‌పి ఎఎస్ చక్రవర్తి అన్నారు. మండలంలోని శ్రీహరిపురం గ్రామంలో గల ఓ చెరువులో పక్కనే ఉన్న మరొక పంచాయతీ ఆర్‌ఆర్ కాలనీకి చెందిన ప్రజలు ఉపాధి హామీ పనులు చేయడంతో శ్రీహరిపురం గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఇరు గ్రామస్తులు మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో ఈ విషయం తెలుసుకున్న డిఎస్‌పి రెండు గ్రామాలకు చెందిన పెద్దలును గ్రామస్తులతో పాటు అధికారులతో వంగరలో మంగళవారం చర్చించి రాజీ కుదుర్చారు. అంతకుముందు వంగర పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వావిలిపల్లి శ్రీనివాసరావు, రాజాం రూరల్ సిఐ హెచ్ ఉపేంద్రరావు, వంగర ఎస్ఐ ఆర్ జనార్ధన్ రావు, ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ, నాయకులు కరణం సుదర్శన రావు, తదితరులు ఉన్నారు.

పాఠశాలలో సౌకర్యాలపై కరపత్రం విడుదల

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో తరగతి నుండి పదో తరగతి వరకూ పాఠశాలలో లభించే విద్యా సౌకర్యాలను వివరిస్తూ కరపత్రాన్ని విడుదల చేశారు. పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు రహీం షేక్ లాల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బి కిరణ్ కుమార్, ఎల్ వి సత్యనారాయణ, బి శ్రీదేవి, సిబ్బంది ఉమా తదితరులు ఆధ్వర్యంలో కరపత్రాలను విద్యార్థులకు మంగళవారం అందజేశారు. పాఠశాలలో సకల సదుపాయాలను వివరిస్తూ గత సంవత్సరం వలే కరపత్రాలను ముద్రించి వాటి ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు రహీం షేక్ లాల్ తెలిపారు. బడి ఈడు పిల్లలు బడిలో చేరేటట్లు వివిధ గ్రామాల్లో రెండో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఐదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు, 8వ తరగతి ఉత్తీర్ణమైన విద్యార్థులు ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్చుకునే ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాలలో లభిస్తున్న విద్యాపరమైన సౌకర్యాలు, ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలు వివరిస్తూ కరపత్రాన్ని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయపద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

సమీకృత వ్యవసాయ పద్ధతులపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో వ్యవసాయిక ఉత్పత్తి సంఘాలు డైరెక్టర్లకు, ఎఫ్‌పిఒ సిబ్బందికి, సిసిలకు, విఒఎలకు, ఎన్‌జిఒ సిబ్బందికి శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని సెర్ప్ అధికారులు నిర్వహించారు. శిక్షణలో వైఎస్ఆర్ క్రాంతి పదం ఎపిడి వై.సత్యంనాయుడు మాట్లాడుతూ ప్రతి రైతు ప్రతి ఏటా పంట మార్పిడి జరపాలని, ప్రతి రైతు చిరుధాన్యాల పంటలు పండించుకోవడానికి ముందుకు రావాలని, పచ్చి రొట్టె ఎరువు సంబంధించిన విత్తనాలు సబ్సిడీపై ఇస్తామని తెలిపారు. అలాగే వ్యవసాయశాఖ ద్వారా అమలవుతున్న పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. డిపిఎం పి.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఎఫ్‌పిఒలో ఉన్న రైతులు ఈ సమీకృత వ్యవసాయం చేయడానికి ముందుకు రావాలని అందుకు ఎఫ్‌పిఒ ద్వారా రుణాలు తీసుకొని పెట్టుబడులు పెట్టుకొని ఆదాయం పెంచుకోవాలని తెలిపారు. ఎపిసిఎన్ఎఫ్ డిపిఎం ధనుంజయరావు మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులు వేసి వ్యవసాయం చేయడం వల్ల పెట్టుబడులు తగ్గి ఆదాయం వస్తుందని తెలిపారు. ఎపిఎం పి.సురేష్ మాట్లాడుతూ వ్యవసాయం చేస్తున్న వారంతా మహిళా సంఘ సభ్యులు కనుక చిన్న సంఘాల సమావేశంలో గ్రామ సంఘం సమావేశంలో గ్రామాల్లో విఒఎలు అవగాహన కల్పించాలని, క్లస్టర్ పరిధిలో సీసీలు సమీకృత వ్యవసాయంపై అవగాహన కల్పించాలని కోరారు. ఎఫ్‌పిఒ ఎపిఎం వి.మోహన్ మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులకు ఎఫ్‌పిఒ సిబ్బంది అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల సమాఖ్య కార్యదర్శి వై.జగదీశ్వరి, ఎఫ్‌పిఒ సిసి వై.అప్పలనాయుడు, సిసిలు ఎం.నాగభూషణరావు, ఎం నాయక్, ఎం.గవరన్న దొర, సిహెచ్ గంగయ్య, సి. హెచ్ రవణమ్మ, పి.గౌరమ్మ, రైతు మిత్ర వెంకటరమణ, విఒఎలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిడి వై.సత్యంనాయుడు

నవధాన్యాలు కిట్లు పంపిణీ

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని చాపరాయిబిన్నిడిలో మంగళవారం 40 మంది రైతులకు నవధాన్యాల కిట్లను ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి.షణ్ముఖరాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భూమిని సారవంతం చేసుకోవడానికి, ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవడానికి, ఖర్చులు తగ్గించుకోవడానికి ప్రతి రైతు తప్పనిసరిగా తమకున్న విస్తీర్ణంలో నవధాన్యాలను 20 నుంచి 30 రకాలు వివిధ రకాల విత్తనాలను ఎకరాకు 10 కేజీల చొప్పున తొలకరి వర్షాలకు ముందు తమ విస్తీర్ణంలో వేసుకోవడం వల్ల ప్రయోజనం కలుగుతుందన్నారు. జిల్లాలోని 15 మండలాల్లో, 267 గ్రామ పంచాయతీల్లో 36,163 రైతులతో ఈ ఖరీఫ్ సీజన్లో తప్పనిసరిగా నవధాన్యాలు వేసేలా చూడాలని కార్యకర్తలకు సూచించారు. గిరిజన ప్రాంతాల్లో పశువులను బీడుగా విడిచిపెట్టడం జరుగుతున్నప్పటికీ నవధాన్యాలు పెరిగిన తర్వాత పశువులు తిన్న భూమిలో నవధాన్యాలు వేర్లు ఉండడం వల్ల సమృద్ధిగా సారవంతమవుతుందని అప్పుడు ప్రధాన పంటలకు అవసరమైన అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని పంటల దిగుబడులు పెరుగుతాయని రైతులు ఆర్థిక అభివృద్ధి చెందడానికి ఈ నవధాన్యాలు పాత్ర అత్యంత కీలకమన్నారు. మండలంలోని అన్ని గ్రామాలను ఏ విధమైన రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకుండా సహజసిద్ధంగా లభించే వనరులను పుష్కలంగా వినియోగించుకుని పంటలు పండించుకొనేలా బయోమండలంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు తయారు చేయడం జరుగుతుందన్నారు. ఎపిసిఎన్ఎఫ్, జట్టు సంస్థ ఉమ్మడిగా పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.దివ్య భారతి, ఎంపిటిసి ఎం.శ్రీలక్ష్మి, ప్రకృతి వ్యవసాయం డివిజన్ ఇన్‌ఛార్జ్ జి.అన్నపూర్ణ, ఎంటి జి.నిర్మల, మండల ఇంచార్జ్ ఎం.సీతారామ్, కోఆర్డినేటర్లు, రైతులు సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: రైతులకు నవధాన్యాల కిట్లను పంపిణీ చేస్తున్న మేనేజర్

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

ప్రజాశక్తి - భామిని

మండలంలోని వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు చొరవతో స్థానిక సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కారానికి చొరవ చూపాలని ఎంపిపి తోటశాంతి కుమారి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ జి.కృష్ణారావు అధ్యక్షతన మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి కె. సింహాచలం మండలంలో రైతు భరోసా, పిఎం కిసాన్ ద్వారా ఎంత మంది రైతులు లబ్ది పొందారు, రబీ, ఖరీఫ్ సీజన్‌కి పూర్తి స్థాయిలో ఎరువులు యూరియా, ఫొటోస్ రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచుతామని తెలిపారు. రబి సీజన్‌లో మండలంలో 813 ఎకరాలలో సాగైనా వరి కొనుగోలు పరిస్థితి ఏమిటని మండలి ప్రేత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం ప్రశ్నించారు. 4 సెంటర్ల ద్వారా 1500 మెట్రిక్ టన్నులు రబీ ధాన్యం కొనుగోలు చేస్తున్నామని ఏఓ తెలిపారు. మండలంలో 114 ఎకరాలు మొక్క జొన్న రైతులకు నష్టం కలిగిందన్నారు. నష్ట పరిహారం ఎప్పుడన ఎంపిటిసి కొత్తకోట చంద్రశేఖర్ ప్రశ్నించగా, ఖరీఫ్ సాయంతో ఈ డబ్బులు కూడా విడుదల చేస్తుందని తెలిపారు. మండలంలోని అన్నీ పంచాయతీలలో ముమ్మరంగ ఉపాధి హామి పనులు జరుగుతున్నాయని ఉపాధి ఏపిఓ తులసి దాస్ తెలిపారు. వలస వెళ్లిన వారికి కూడా ఉపాధి హామీ మస్టర్‌లో హాజరు నమోదు చేస్తున్నారని, పరిశీలించాలని కో ఆప్షన్ సభ్యులు విశ్వనాథ్ పట్నాయక్ తెలిపారు. ల్యాండ్ డెవలప్మెంట్ పనులు కూడా ఉపాధి హామి ద్వారా చేపట్టడానికి చొరవ చూపాలని ప్రేత్యేక ఆహ్వానితులు కొవ్వాడ చిరంజీవులు సూచించారు. ఇంటింటి కుళాయిలో రూ. 60వేలుతో చేపట్టిన పైప్ లైన్ పనులు బిల్లులు ఏడాదిగా పెండింగ్ లో ఉన్నాయని ఆర్ డబ్లు ఎస్ ఏ ఈ అలికాన సందీప్ కి వడ్డంగి ఎం పి టి సి కొండగొర్రి ఉషారాణి తెలిపారు. ఇళ్ల లే అవుట్ ఇచ్చిన వాళ్ళకి జియో ట్యాగింగ్ చేస్తున్నామని, ప్రధాన మంత్రి అవాస్ ద్వారా ఇల్లు నిర్మాణం చేపట్టే వాళ్ళకి బేసిక్ పేమెంట్ అయ్యిందని హౌసింగ్ ఏ ఈ ప్రభాకర్రావు తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి అవసరం అయిన ఇసుక స్థానికంగా తెచ్చుకునే వెసులుబాటు కల్పించాలని స్థానిక ప్రజాప్రతినిధులు కోరారు. ఈ సమావేశంలో మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిపి శాంతికుమారి

మాట్లాడుతున్న ఎంపిపి తోట శాంతి

ముగిసిన లీడర్‌షిప్ శిక్షణ

శంగవరపు కోట: వాసవి క్లబ్ జిల్లా 214 ఏ అధీనంలో రెండు రోజులపాటు పట్టణంలోని ప్రైవేటు కల్యాణ మండపంలో నిర్వహించిన వాసవి అకాడమీ ఫర్ లీడర్షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం విజయవంతంగా ముగిసిందని అకాడమీ ఫర్ లీడర్షిప్ ట్రైనింగ్ ప్రోగ్రాం చైర్మన్ హెచ్ నానాజీ మంగళవారం తెలిపారు. ఈ ప్రోగ్రాంలో 80 మంది వాసవియాన్స్ తమ వ్యక్తిగత శిక్షణ కార్యక్రమాన్ని తీసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూని కేషన్ స్కిల్స్ ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీకింగ్ లీడర్షిప్ ట్రైనింగ్‌తో పాటు బిజినెస్ స్కిల్స్ అదేవిధంగా సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుంటూ ఆర్థిక పరిపుష్టత ఏ విధంగా కలుగుతుందన్న అంశా లపై శిక్షణ ఇచ్చామన్నారు. వాసవి క్లబ్ ఇంటర్నే షనల్ పూర్వపు అంతర్జాతీయ అధ్యక్షుడు వాసవి యన్, గోల్డెన్ స్టార్ కెసిజిఎఫ్ డాక్టర్ తిరువీధి, వేణుగోపాల్ పైలట్ ఫ్యాకల్టీగా వ్యవహరించారు. వాసవి అకాడమీ ఫర్ లీడర్షిప్ ట్రైనింగ్ సెమినార్‌కి ముఖ్య అతిథిగా అంతర్జాతీయ కార్యదర్శి వాసవియన్ గోల్డెన్ స్టార్ కెసిజిఎఫ్ ఇరుకుల్ల రామకృష్ణ హాజరయ్యారు.

విద్యార్థులకు పొడుపు..విడుపు కథలపై అవగాహన

ప్రజాశక్తి- పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం తొమ్మిదవ రోజు పొడుపు కథలు, విడుపు కథలు గురించి తపంటాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు, రాష్ట్ర ఉత్తమ అవార్డ్ గ్రహీత కె.జనార్ధనరావు అవగాహన కల్పించారు. కథ కానీ కథ పొడుపు కథ అని ఇవి మెదడుకు మేత వేస్తాయని, విద్యార్థుల్లో ఆలోచనలను ప్రేరేపిస్తాయని, తెలివి తేటలకు సాన బెట్టి పదునుపెడతాయని, ప్రకటనా సామర్థ్యం పెంపొంది సమస్యలను పరిష్కరించగలిగే కౌశలాన్ని వృద్ధి చెందుతుందని అన్నారు. విద్యార్థులచే పొడుపు కథలు, సామెతలు చెప్పించారు. అలాగే డ్రాయింగ్ మాష్టర్ మురళి మెమరీ డిజైన్, ఫ్లోర్ డిజైన్, లైనింగ్ డిజైన్ విద్యార్థిని, విద్యార్థులకు నేర్పించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక శాఖా గ్రంథాలయం చిన్నారులు విజ్ఞాన పరమైన పరిజ్ఞానం పుస్తకాలు చదివారు. కార్యక్రమంలో సహాయకుడు రామకష్ణ పాల్గొన్నారు.

సీతానగరం: పుస్తకాలు పంపిణీ చేస్తున్న గ్రంథాలయ నిర్వాహకుడు

సీతానగరం :విద్యార్థులకు చదువుపై ఆసక్తి పట్టుదల ఉండాలని గ్రంథాలయ అధికారి బి వెంకటరావు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వేసవిలో అల్లరి ఆటలకు స్వస్తి చెప్పి విజ్ఞానాన్ని పెంపొందినందుకు వివిధ రకాల పుస్తకాలను చదివితే విజ్ఞానం పెరుగుతుందన్నారు. వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

పర్యాటక అభివృద్ధికి చర్యలు : పిఒ

సీతంపేట: సీతంపేట ఏజెన్సీలో పర్యాటక అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకొంటామని ఐటిడిఎ పిఒ కల్పనకుమారి అన్నారు. మంగళవారం సున్నపుగెడ్డ, బెనరాయి, దారిమల్లి జలపాతాలు, పొల్ల వ్యూ పాయింట్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ సున్నపుగెడ్డ జలపాతం వద్ద పర్యాటకులు నడవడానికి వీలుగా రహదారి సౌకర్యం కల్పిస్తామని, అలాగే కూర్చోవడానికి బెంచీలు ఏర్పాటు చేస్తామన్నారు. అవసరమైన చోట కర్రలతో చేసిన బ్రిడ్జిలు ఏర్పాటు చేస్తామన్నారు. పూర్తిగా ఎకో టూరిజంగా ఏర్పాటు చేస్తామని అన్నారు. అలాగే పొల్ల వ్యూ పాయింట్‌ను కూడా సుందరంగా తయారు చేస్తామని అన్నారు. బెనరాయి జలపాతం వద్ద పర్యాటకులు కిందకు దిగడానికి వీలుగా మెట్లు ఏర్పాటు చేస్తామన్నారు. జలపాతం చాలా బాగుందన్నారు. డ్రెస్సింగ్ రూం కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. జలపాతం వద్దకు వెళ్లడానికి బెనరాయి గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా బెనరాయి గ్రామం మీదుగా కాకుండా వేరే రహదారి సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా దారిమల్లి జలపాతాన్ని కూడా అభివృద్ధి చేస్తామని అన్నారు. పిఒ వెంట జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు, పాలకొండ ఎఫ్‌ఆర్‌ఒ తవిటినాయుడు, డిఇ కృష్ణమోహన్, పార్క్ మేనేజర్ సవర రాజు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జలపాతాలను పరిశీలిస్తున్న పిఒ కల్పనకుమారి

స్ప్రేయింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

మలేరియా నివారణకు ప్రతి ఇంటికి ఎసిఎం 5శాతం స్ప్రేయింగ్ చేయించుకోవాలని జిల్లా మలేరియా నివారణ అధికారి ఎ. శ్యామ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని దురిబిలి, పెల్లివలస, శివన్నపేట కాలనీలో జరుగుతున్న స్ప్రేయింగ్ కార్యక్రమన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మలేరియా బారిన పడకుండా ఉండాలంటే ప్రతి ఇంటికీ తప్పనిసరిగా స్ప్రేయింగ్ చేయించుకోవాలని అలాంటప్పుడే మలేరియా ఏజెన్సీలో తగ్గుముఖం పడుతుందన్నారు. కార్యక్రమంలో మలేరియా కన్సల్టెంట్ అధికారి జి.రామచంద్ర, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్. నారాయణరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్ప్రేను పరిశీలిస్తున్న అధికారులు

జగత్‌పల్లి వ్యూ పాయింట్ సందర్శించిన జెసి

సీతంపేట : మండలంలోని జగత్‌పల్లి వ్యూ పాయింట్ ను మంగళవారం జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ సందర్శించారు. పనులు ఎందుకు నిలిపారని ఆరా తీశారు. అనంతరం వ్యూ పాయింట్ ప్రకృతి అందాలు ఆశ్వాదించారు జగత్ పల్లి రిసార్ట్స్ నిలిచిన పనులను పరిశీలించారు. ఈయనతో పాటు పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్ కమర్, తహశీల్దార్ నర్సిమ్మూర్తి తదితరులు పాల్గొన్నారు..

ఉపాధి పనులను పరిశీలించిన ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

మండలంలోని సంగం వలస పంచాయితీ మడకవానివలసలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆయన మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా రెండుపూటలా పనులకు బదులుగా ఒక్క పూటే పనులు నిర్వహించేలా చూడాలని, పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఉపాధి హామీ వేతన దారులు కోరారు. ఆయన వెంట ఎపిఒ నాగలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: మండలంలో గోపాలపురంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ డొంక త్రినాథులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతన దారులు సమయపాలన పాటించి పనులు చేపట్టాలని సూచించారు. కొలతల ప్రకారం పనులు చేపట్టి గిట్టుబాటు కూలి పొందాలన్నారు. ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని అన్నారు.

పెన్షనర్ల ఇంటి వద్దకే ఇకెవైసి

ప్రజాశక్తి - కురుపాం

స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయ పరిధిలో గల కన్నప్పదొరవలసకు చెందిన మరడాన స్వామినాయుడు ఇంటి వద్దకు మంగళవారం ఎస్‌టిఒ కె.శంకరరావు వెళ్లి ఇకెవైసి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 562మంది పెన్షనర్లు ఇకెవైసి చేయించుకున్నారని, ఇంకా 225 మంది పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు ఇకెవైసి చేయించుకోవాల్సిన అవసరం ఉందని,త్వరగా వారు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కురుపాం మండల పెన్షనర్ల సంఘ అధ్యక్షులు టి.పాండు రంగ, పెన్షనర్ల సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అఖండ అన్న సంతర్పణ

వీరఘట్టం : మండల కేంద్రంలోని మంగళవారం ఘనంగా అఖండ అన్నసంతార్పణ కార్యక్రమం నిర్వహించారు. పైడితల్లి గ్రామ దేవత మహోత్సవంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు గ్రామ దేవత ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి ప్రసాదం స్వీకరించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బస్సుల ఫిట్ నెస్ రెన్యువల్

సాలూరు: సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల పరిధిలోని ప్రయివేటు స్కూల్ బస్సులకు సంబంధించి ఫిట్ నెస్ సర్టిఫికెట్లు రెన్యువల్ చేసుకోవాలని ఎంవిఐ జెవిఎస్ ప్రసాద్ కోరారు. నిర్ధేశించిన గడువులోగా రెన్యువల్ చేసుకోకపోతే తదుపరి చర్యలకు బాధ్యులవుతారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

పురుగు మందు తాగి వృద్ధుడు మృతి

పార్వతీపురం రూరల్: మతిస్థిమితం లేక పురుగు మందుతాగి వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు లచ్చిరాజుపేటకు చెందిన ఎం. అప్పలనాయుడు(62)కు కొన్ని రోజులుగా మతిస్థిమితం లేకపోవడంతో చిత్రవిచిత్రంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ క్రమంలో మతిస్థిమితం కోల్పోయిన ఆయన సోమవారం కుటుంబ సభ్యులు ఉపాధి పనికి వెళ్లాక పురుగు మందు తాగాడు. పనులు ముగించుకొని ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్నచూసి జిల్లా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

అయ్యో ఒక్క దానినే!

ప్రజాశక్తి -భామిని

గత నాలుగు నెలలు తమ పంట పొలాలు, జీడీ, మామిడి తోటల్లో సంచరిస్తూ, తమతో బంధాన్ని పెనవేసుకున్న 6 ఏనుగులు గుంపులో నాలుగు విద్యుత్ షాక్‌కు గురై ఒకేసారి చనిపోయాయి. ఆ బాధ దిగమింగేలోగా మిగిలిన మగ, ఆడ ఏనుగుల జంటలో ఆడ ఏనుగు ఒడిశాలోని షరా, బడిగంకి గ్రామం వైపు సోమవారం రాత్రి బ్యారేజ్ మీదుగా వెళ్లిపోయింది. మిగిలిన మగ ఏనుగు మనుసుల్ని చూసి, తోటి వారు తోడు లేక, ఏం చేయాలో తోచక పరిగెడుతుంటే చూసిన స్థానికులు అయ్యో ఒక్కదానివే అయిపోయావా అంటూ బాధను వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి ఫారెస్ట్ రేంజ్ అధికారి కె.తవిటి నాయుడు ఉన్న రెండు ఏనుగుల పరిస్థితిపై ఫారెస్ట్ ఫారెస్ట్ సిబ్బందితో చర్చించారు. ఈ రెండు ఏనుగులు తమ తోటి నాలుగు ఏనుగులు కొన్ని రోజులుగా కనిపించకపోవడంతో వాటి ప్రవర్తన విభిన్నంగా ఉండవచ్చని, ఫారెస్ట్ సిబ్బంది అప్రమత్తంగా వుంది, గ్రామస్తులను కూడా అప్రమత్తం చేయాలని సూచించారు. పూర్తి స్థాయిలో వాటి కదలికలు మానిటరింగ్ చెయ్యాల్సి ఉంటుందని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారి లక్ష్మణ మూర్తి , రేంజర్ హరికృష్ణ,అటవీ సిబ్బంది ఉన్నారు.

ఒంటరిగా తిరుగుతున్న ఏనుగు

డిఇఒ ఆకస్మిక పరిశీలన

ప్రజాశక్తి - భామిని

స్థానిక ఆదర్శ పాఠశాలను, బత్తిలి జిల్లా పరిషత్ హై స్కూల్, నులకజోడు అప్పర్ ప్రైమరీ స్కూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నులకజోడులో పాఠశాలలో చేపట్టిన నాడు నేడు పనులు పరిశీలించి, పూర్తి కానీ అంశాలు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ఆదర్శ పాఠశాలలో జగనన్న విద్యా కానుక -4 సామాగ్రి నిల్వ చేసిన గదిని పరిశీలించి, పంపిణీ అంశాలను ఎంఆర్‌సి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎపిఒ శంకరరావు, సిసి సూరజ్ కుమార్, ఎంఇఒ ఎ.శ్రీనివాసరావు, రామకృష్ణ, సిఆర్‌పిలు ఉన్నారు.

నిత్య అన్నప్రసాద వితరణ అభినందనీయం

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

దూర ప్రాంతాల నుంచి రోగుల సహాయం కోసం వచ్చిన వారికి నిరంతర అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ముఖ్య కార్యదర్శి ఎల్‌వి సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక జిల్లా ఆసుపత్రి ఆవరణలో 649 రోజులుగా నిరంతర అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న జిల్లెల్లమూడి అమ్మ సేవా సమితి నిర్వాహకుల అభ్యర్థన మేరకు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఐటిడిఎ పిఒగా పనిచేసిన కారణంగా ఈ ప్రాంతంతో అనుబంధాన్ని పెంచుకున్నానని ఇక్కడ ఎంతోమంది మంచి కళాకారులు, కవులు, సామాజిక సేవ కార్యకర్తలు స్నేహితులుగా ఉండడం వల్ల వారి నుండి ఎంతో నేర్చుకున్నానని అన్నారు. మాజీ ఉద్యోగులంతా కలిసి నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహించడం వలకల సమాజానికి ఎంతో కొంత సేవ చేయగలుగుతామని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఎన్నో జరగాల్సి ఉందని ఆశించారు. కార్యక్రమంలో ప్రముఖకవి గంటేడ గౌరునాయుడు, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టరు వాగ్దేవి, జట్టు ఆశ్రమ వ్యవస్థాపకులు డొల్లు పారినాయుడు, డి.గణపతిరావు, బలగ సత్యనారాయణ, జి.అప్పలరాజు, పి.చిన్నంనాయుడు, ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షులు కిషోర్, జిల్లెళ్లమూడి అమ్మ సేవా సమితి సభ్యులు గంటేడ చిన్నం నాయుడు, సోమేశ్వరరావు, దవళ గౌరీప్రసాద్, భవిరిపూడి శ్రీరామమూర్తి నాయుడు, బి.అడివినాయుడు, శీలంకి త్రినాధరావు, బి.తిరుపతిరావు, రంభ గంగునాయుడు, వై.శ్రీను, పి.గౌరీశంకరరావు పాల్గొన్నారు.